ఉండబట్టలేక ఆనంద్ కేశవతో..

''మీ అన్నయ్య మంచి పొజిషన్‌లో ఉన్నాడు. తన ఫారిన్ చదువుకు మీ నాన్న ఎంతో ఖర్చుపెట్టాడు కూడా! ఆ రెండెకరాల పొలం అమ్మకపోతే ఆయనకు గడవదా? నీకు వదిలిపెడితే బావుండేది. నాకు తెలిస్తే నేనైనా అడిగే వాణ్ని!'' అన్నాడు. కేశవ వెంటనే..

''వద్దు బావా! మీకు నామీద ఉన్న అభిమానం చాలు. అన్నయ్యకు కూడా అమ్మానాన్నల ఆస్తిలో హక్కు ఉంటుంది కదా! ఏమాత్రం వీలున్నా నేనే ఆ పొలం కొనుక్కునేవాణ్ని. కానీ, నా దగ్గర డబ్బు లేదు. అసలు మా అక్కకు ఏమైనా ఇవ్వాలన్నా నా దగ్గరలేదు'' అన్నాడు నిస్సహాయంగా. ఆ పొలం కొనుక్కోవడానికి ఆనంద్ అప్పుగా డబ్బు ఇస్తానన్నా కేశవ ఒప్పుకోలేదు.

కేశవకు నెలనెలా ఆదాయం వచ్చే ఉద్యోగం ఏదీ లేదు. వ్యవసాయంలో ఆదాయం అంతంత మాత్రమే. మధ్యమధ్య తనదగ్గరికి వచ్చేటప్పుడు కూరగాయలు, తినుబండారాలు, పచ్చళ్లు, పొడులు పట్టుకొచ్చేవాడు. లక్ష్మి కూడా సహకరించకుంటే అది సాధ్యపడేది కాదని తనకూ తెలుసు. కొన్నేళ్లుగా కేశవ చాలా కుంగిపోయినట్టు కనిపించేవాడు.

''ఏమిట్రా.. ఏమైనా ఇబ్బందా?!'' అంటే..

''ఏమీ లేదక్కా!'' అనేవాడు.

అడగ్గా అడగ్గా కొడుకు శరత్ సరిగ్గా చదువుకోవట్లేదనీ, అల్లరిచిల్లరగా తిరుగుతున్నాడనీ చెప్పాడు.

కేశవను ఒప్పించి మేనల్లుణ్ని తెచ్చి తన దగ్గరే ఉంచుకుని స్కూల్లో చేర్పించింది. కేశవ చెప్పిన దానికన్నా మొండితనం ఎక్కువే ఉందని అర్థమయ్యింది.

''మీరంతా బాగానే ఉన్నారు. తాతయ్య కోసం, నానమ్మకోసం మా నాన్నను ఊర్లోనే కట్టిపడేసి సరిగ్గా చదివించక పైకి రానీకుండా చేశారు. అందుకే మేమిలా ఉన్నాం!'' అనే శరత్ అభిప్రాయాన్ని ఎంత నచ్చచెప్పినా మార్చలేకపోయింది తను.

వాణ్ని బాగా చదివించాలనుకున్నా పట్టుమని పదినెలలు బలవంతంగా ఉండి.. మళ్లీ ఊరికి వెళ్లిపోయాడు. కూతురి పెళ్లికి, ఆ తరువాత అప్పులకీ కేశవ ఆ రెండెకరాలూ అమ్మాడని తెలిసి చాలా బాధపడింది.



ఈలోగా శిరీష మెడిసిన్, శ్రీకాంత్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. శిరీష పీజీలో ఉండగా డా. విజయ్‌తో పెళ్లికాగానే ఇద్దరూ ఇరాన్ వెళ్లి, కొన్నాళ్లకు ఇండియా వచ్చి నర్సింగ్ హోమ్ పెట్టుకున్నారు. శ్రీకాంత్ కూడా అమెరికాలో ఎమ్మెస్ చేసి, సంధ్యతో పెళ్లికాగానే అక్కడే ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

పదేళ్ల కింద ఆనంద్ చనిపోవడంతో తనచుట్టూ చీకట్లు కమ్ముకున్నాయి. ఆరోగ్యం కూడా దెబ్బతిన్నది. అదివరకే శిరీష దగ్గర తను ఉండననడంతో వాళ్లే పిల్లలకోసం తమ ఇంట్లోనే ఫైఫ్లోర్‌లో ఉంటున్నారు. తమకు ఎప్పటికీ ఇంట్లోనే ఉండేలా వంటమనిషి ఉంది. పై పనులకు ఇంకో ఆవిడ ఉంది. రోజూ శిరీష వచ్చిచూసి కాసేపు మాట్లాడుతూ ఉంటుంది. ఒకవిధంగా జీవితం సాఫీగానే సాగుతున్నది. ఇప్పుడీ వార్త.. కేశవ ఇల్లు అమ్ముతున్నాడని! అంతకంటే ఎక్కువ బాధపెట్టిన విషయం.. కొద్దిగా పక్షవాతంలా వచ్చి తగ్గిందనీ, కర్రతో నడుస్తున్నాడనీ! కొడుకు సిటీలోనే ఉంటూ ఏదో చిట్‌ఫండ్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడనీ, అందులో డబ్బులు వాడుకున్నాడనీ, కట్టకపోతే ఊరుకునేది లేదని వాళ్లు ఒత్తిడి చేస్తున్నారనీ, ఎలాగైనా ఇల్లు అమ్మి డబ్బు ఇవ్వమంటున్నాడని తెలిసి ఇంకా బాధ కలిగింది.

ఇల్లు మరొకరి అధీనంలోకి వెళ్లకముందే ఒక్కసారి చూసిరావాలని, ఆ ఇంటితో ఉన్న జ్ఞాపకాల్ని మరోసారి తల్చుకోవాలనీ బలంగా అనిపించింది. కేశవ ఇబ్బందులేమిటో ఓసారి అడిగి.. తన చేతనైనంత సాయం ఏదైనా చేయాలని కూడా అనిపించింది. అందుకే ఇప్పుడీ ప్రయాణం.. ఆదివారమైతేనే శిరీషకు కొంచెం సమయం చిక్కుతుంది. కానీ, ఏమిటో సడన్‌గా నిన్న..

''అమ్మా! రేపు మనం అమ్మమ్మా వాళ్ల ఊరెళ్తున్నాం!'' అన్నది.

* * *

''అమ్మా! ఊరొచ్చింది. నిద్రపట్టిందా?!''.. శిరీష అడుగుతుంటే ఆలోచనల దారం తెగింది.

ఊరు చాలా మారింది. ముందున్న చెరువు చిక్కిపోయి చిన్నగా అయింది. అయినా కలువ మొగ్గలు నిండుగా ఉన్నాయి. రాజరత్నం పాన్‌షాప్ ఉన్నచోటునే ఓ బిల్డింగూ, అందులో పెద్ద కిరాణాషాపు వెలిశాయి. ఆ పక్కనే సెలూన్ కొంచెంమారి అద్దాలతో నీట్‌గా కనిపిస్తున్నది. మణెమ్మ టైలర్ మాయమై ఓ రెడీమేడ్ బట్టలషాప్ వచ్చినట్టుంది.

'ఈ ఊరినిక మళ్లీ చూస్తానా!' అనిపించింది లలితకు.

చూస్తుండగానే ఇంటి ముందు కారు ఆగింది. ఓ పక్కన ప్రహరీ కొంచెంకూలి రాళ్లు, మట్టికుప్పగా పడి ఉంది. అందులోంచే ఓ బతాణీతీగ నిండా గులాబీరంగు పూలతో తొంగి చూస్తున్నది. పెద్ద వేపచెట్టు పచ్చగా ఉండి బోలెడంత నీడ ఇస్తున్నది. ఇల్లు బాగా పాతబడినా ఎప్పట్లాగే కళగా ఉంది. పదేళ్లనాడు చూసిన ఇల్లు. ఆనంద్ పోయాక కేశవ తీసుకువస్తే బలవంతంగా వచ్చి.. ఓరోజు ఉండి వెళ్లిందంతే! మళ్లీ ఇప్పుడే రావడం.

తను ఆడిపాడిన ఇల్లు, అమ్మానాన్నలతో ఆనందంగా గడిపిన ఇల్లు, బాల్య, యవ్వన జ్ఞాపకాలతో ముడిపడిన ఇల్లు.. ఇక తమదికాదా?! కనీసం కేశవది కూడాకాదా?! ఇక కేశవ ఎక్కడుంటాడు? ఆలోచనలతోనే శిరీష చెయ్యి పట్టుకుని లోపలికి అడుగుపెట్టింది లలిత.

''అక్కా!'' అంటూ చేతికర్రతో మెల్లగా నడుస్తూ వచ్చి.. గట్టిగా చేయి పట్టుకున్నాడు. ఇద్దరి కళ్లలోనూ నీళ్లుతిరిగాయి.

''ఏంట్రా ఇది?! ఇలా అయిపోయావు? నాతో మాట మాత్రం చెప్పకూడదా?! నేనంత పరాయిదాన్ని అయిపోయానా! లేక ఏమీ చేయలేనని అనుకున్నావా?!'' మాట పూర్తిగా రాకుండానే గొంతు గద్గదమైంది.

''లేదక్కా!! నువ్వు బాధపడతావని.. అయినా బాగానే ఉన్నానుగా!'' అన్నాడు కేశవ. అతని గొంతులో ఎప్పుడూ కనిపించని దిగులు ధ్వనించింది. ''నువ్వు రెస్ట్ తీసుకో అక్కా! నేను రిజిస్టర్ ఆఫీస్ దాకావెళ్లి ఇప్పుడే వస్తాను!'' అన్నాడు.

''నా కారులో వెళ్దాం మామయ్యా! నేనుకూడా వస్తాను. అమ్మకూడా రావాలి కదా.. సంతకం పెట్టడానికి'' అన్నది శిరీష.

**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.**